ప్రజాశక్తి
బుధవారం 14 మే 2025 5
శ్రీకాకుళం



ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌కు దరఖాస్తుల స్వీకరణ



శ్రీకాకుళం : ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల మూడో వారంలో ప్రారంభమయ్యే 21వ బ్యాచ్‌లో 16 మందికి మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441161051, 9390886033 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్పొరేషన్ ఆస్తులు ప్రై'వేటు'

- మౌలిక వసతుల అభివృద్ధి పేరుతో ప్రైవేట్‌పరం
- పిపిపి పద్ధతిలో అప్పగింతకు ప్రతిపాదనలు
- శ్రీకాకుళం కార్పొరేషన్ సహా తొమ్మిది అంశాల్లో పెట్టుబడులు
- ప్రైవేట్ చేతికి విలువైన స్థలాలు



స్థానిక సంస్థలకు నిధులు సమకూర్చి వాటితో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ బాధ్యత నుంచి తప్పకునేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధి పేరుతో ప్రైవేట్ వ్యక్తులు గానీ సంస్థలకు గానీ అప్పగించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్ (యుసిఎఫ్) పేరుతో నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది. కార్పొరేషన్లలో విలువైన స్థలాలు, మార్కెట్లతో పాటు పార్కులు, మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ వంటి పనుల్లో ప్రైవేటు పెట్టుబడులను తీసుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (4పి) విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు గానీ సంస్థలకు గానీ అప్పగించాలని భావిస్తునట్లు తెలుస్తోంది. ఇప్పటికే శ్రీకాకుళం కార్పొరేషన్ అధికారులు తొమ్మిది అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రపంచ బ్యాంకు సూచనలతో తీసుకొస్తున్న పట్టణ సంస్కరణల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుసిఎఫ్ కాన్సెప్ట్‌ను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ యుసిఎఫ్ అమలు కోసం రూ.లక్ష కోట్లను పట్టణాలకు విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వీటిని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆయా స్థానిక సంస్థల్లో ప్రైవేటు పెట్టుబడులకు అవకాశమున్న అంశాలపై ప్రతిపాదనలు పంపాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నివేదికలు పంపారు. అందులో ముఖ్యమైనది శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం. కార్పొరేషన్ కార్యాలయం పునర్నిర్మాణం, అభివృద్ధి పేరుతో 0.33 ఎకరాల స్థలంలో రెండు అంతస్థుల భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రాజెక్టుకు రూ.9.75 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించారు. ఇందులో 50 శాతం వాటాగా రూ.4.88 కోట్లను ప్రభుత్వ, ప్రైవేట్, పీపుల్ భాగస్వామ్యం కింద... 25 శాతం వాటాగా రూ.2.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం, మరో 25 శాతం వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ.2.44 కోట్లను సమకూర్చాల్సి ఉంటుందని నివేదికలో పొందుపరిచారు. వాణిజ్య సముదాయాలుగా మారిస్తే రెవెన్యూ సమకూరుతుందని పేర్కొన్నారు.

నాగావళి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్

శ్రీకాకుళం నగరంలో నాగావళి నది పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతాన్ని సమగ్రంగా తీర్చిదిద్దేందుకు నాగావళి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పేరుతో అభివృద్ధి చేస్తే ఆదాయం వస్తుందని ప్రతిపాదనలు పంపారు. ఇందుకోసం రూ.700 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇందులో ప్రైవేటు సంస్థలకు రూ.350 కోట్ల వాటా కల్పించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.175 కోట్లను షేర్‌గా ఇస్తాయని భావిస్తున్నారు. ప్రస్తుతం దీనిపై ఏరియల్ సర్వే చేస్తున్నారు. రివర్‌వ్యూ పార్కుల్లో ప్రవేశ రుసుములు, వాణిజ్య స్థలాల లీజు, ఈవెంట్ల వేదికల అద్దెలు వంటి రూపాల్లో ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

● పొట్టి శ్రీరాముల మార్కెట్‌లో రూ.5.50 కోట్ల వాటా

శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో ప్రైవేట్ వ్యక్తులకు గానీ సంస్థలకు గానీ రూ.5.50 కోట్ల వాటా కల్పించనున్నారు. ప్రస్తుతం 0.87 ఎకరాల స్థలంలో ఉన్న మార్కెట్ పునర్నిర్మాణం, అభివృద్ధికి రూ.11 కోట్లు అవసరమవుతాయని అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2.75 కోట్లు (25 శాతం), కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.2.75 కోట్లు (25 శాతం) రావచ్చని భావిస్తున్నారు. సోలార్ రూఫ్ టాప్‌తో షాపులను తిరిగి నిర్మించడం, వాణిజ్య సముదాయాల నిర్మాణం, పార్కింగ్ ప్రాంతం నిర్మించనున్నారు. దుకాణాల అద్దెల ద్వారా రెవెన్యూ వస్తుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

● అదే జాబితాలో బాపూజీ కళా మందిరం

శ్రీకాకుళం నగరంలో పేరొందిన బాపూజీ కళామందిరాన్ని ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సోలార్ రూఫ్ టాప్‌తో పునర్నిర్మాణం, పునరాభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.మూడు కోట్లు అవసరమవుతాయని అంచనాలు రూపొందించారు. ఇందులో ప్రైవేట్‌కు 50 శాతం వాటా (రూ.1.50 కోట్లు) కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం షేర్ (రూ.0.75 కోట్లు), కేంద్ర ప్రభుత్వం 25 శాతం వాటా (0.75 కోట్లు) సమకూరుస్తాయని అంచనా వేస్తున్నారు. ఆడిటోరియం అద్దెల ద్వారా ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.

ఆహ్లాదమూ ప్రైవేటుకే...

పట్టణ పౌరులకు ఆహ్లాదాన్ని అందించే పార్కులనూ ప్రైవేటుకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పూల తోటలు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, ఫుడ్ స్టాల్స్, బోటింగ్, ఫిట్‌నెస్ స్టేషన్లు, మెరుగైన విద్యుద్దీపాలు వంటి సౌకర్యాలతో పార్కులను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం మొత్తం రూ.15 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు.

అందులో ప్రైవేట్‌కు రూ.7.50 కోట్లు (50 శాతం) వాటా కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ షేర్ రూ.3.75 కోట్లు (25శాతం), కేంద్ర ప్రభుత్వ షేర్ రూ.3.75 కోట్లు (25 శాతం) మేర వస్తాయని భావిస్తున్నారు. ప్రవేశ రుసుము, సభ్యత్వాలు, ఫుడ్ స్టాల్స్ లీజింగ్, బోటింగ్, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూరుతుందని ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

వీటితో పాటు మరికొన్ని...

శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలోని పెద్దపాడు చెరువు పునర్నిర్మాణ పనులకు రూ.ఎనిమిది కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం 37.34 ఎకరాల్లో ఉన్న చెరువును అందంగా తీర్చిదిద్ది పార్కుగా ఆహ్లాదానికి అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. విజయాదిత్య పార్కును రూ.11 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. దీంతోపాటు రూ.20 కోట్లతో చేపట్టనున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్‌టిపి) ప్రాజెక్టు పనుల్లో ప్రైవేట్‌కు వాటా కల్పించనున్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పటిష్టంగా 'పోక్సో' అమలు

- నేరస్తులకు శిక్షలు పడేలా దర్యాప్తు ఉండాలి
- పాఠశాలలు, కళాశాలల వద్ద పోలీస్ పెట్రోలింగ్ పెంపు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాలికలపై జరిగే శారీరక, లైంగిక వేధింపులు, నేరాలను అరికట్టేందుకు నిందితులపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పోక్సో చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. పోక్సో, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల దర్యాప్తు, విచారణ, దర్యాప్తులో పురోగతి తదితర అంశాలపై అదనపు ఎస్‌పి కె.వి రమణతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పోక్సో కేసుల వివరాలను పోలీస్‌స్టేషన్ల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, సాంకేతిక ఆధారాలు, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టిసారించి దర్యాప్తులో పురోగతి సాధించాలని సూచించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాల్లో ఫిర్యాదు అందిన వెంటనే కేసు రిజిస్టర్ చేసి, సమగ్రంగా కేసులు దర్యాప్తు చేపట్టాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో 60 రోజుల్లోపు లోపాల కేసుల అభియోగ పత్రాలు పూర్తిస్థాయిలో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు పెండింగ్‌కు గల కారణాలపై ఆరా తీసి, నిశితమైన ఆధారాలతో కేసుల దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు ఉండాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, పబ్లిక్ ప్రదేశాల్లో సిసి కెమెరాల ఏర్పాటు చేసి మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద శక్తి బృందాలతో పోలీసు పెట్రోలింగ్ పెంచాలన్నారు. పోక్సో, మహిళా చట్టాలు, గుడ్, బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు గోవిందరావు, నేతాజీ పాల్గొన్నారు.

'జవహర్ నవోదయ' ప్రతిభ

సిబిఎస్ఇ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు సిబిఎస్ఇ పది, 12 తరగతుల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించారు. సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు పదో తరగతిలో 79 మంది పరీక్షలకు హాజరై శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పరశురాం తెలిపారు. స్కూల్ సగటు మార్కులు 80.7 శాతం కాగా, తెలుగులో 86.22 శాతం, హిందీలో 81.71 శాతం, సైన్స్‌లో 81.73 శాతం సగటుతో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి.

12వ తరగతి ఫలితాల్లోనూ జవహర్ నవోదయ విద్యార్థులు రికార్డు స్థాయిలో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 34 మంది (24 అబ్బాయిలు, 10 అమ్మాయిలు) పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లీష్‌లో 81.09 శాతం, కెమిస్ట్రీలో 79.76 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 79.82 శాతం సగటు మార్కులతో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ విజయాలకు కారణమైన టీచర్లు, సిబ్బందికి ప్రిన్సిపాల్ పరశురాం ధన్యవాదాలు తెలిపారు.

కొబ్బరిలో చీడపీడల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- కవిటి



కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

కొబ్బరిలో చీడపీడల నివారణకు రైతులందరూ ఏకమై సామూహిక చర్యలు చేపట్టాలని పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ సూచించారు. మండలంలోని బల్లిపుట్టుగ, బొరివంక, కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం గ్రామాల్లో కొబ్బరితోటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొబ్బరిలో ఎర్రముక్కు, నల్లముట్టు పురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలే మార్గమని, రైతులు సామూహికంగా వీటిని తోటల్లో ఏర్పాటు చేసుకుంటే చాలావరకు ఈ పురుగుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. గోదావరి జిల్లాల్లో ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో రైతులు లింగాకర్షక బుట్టలు ఉపయోగించి పురుగుల వ్యాప్తిని అరికట్టడంలో విజయం సాధించారని తెలిపారు. అదే సమయంలో రైతులు తమతమ తోటల్లో విరివిగా పచ్చిరొట్ట ఎరువులు వాడడం ద్వారా భూమి సారవంతమై మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. కళింగ కార్పొరేషన్ డైరక్టర్ బార్ల చిన్నబాబు మాట్లాడుతూ కొబ్బరిలో తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకోకపోతే కొబ్బరి మనుగడే కష్టమవుతుందని అన్నారు. ఇప్పటికే కొబ్బరి తోటలు కళావిహీనంగా మారాయని అన్నారు. అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రాజశేఖర్ స్పందిస్తూ కొబ్బరిని ఆశించే ఎటువంటి కీటకాన్ని కానీ వ్యాధిని కానీ సామూహిక చర్యల ద్వారానే నివారించాలని, దీనికోసం వచ్చే నెల నుంచి రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో విహెచ్ఎలు జగదీష్, సంతోష్‌రెడ్డి, ఎంపిఇఒ లలిత, రైతులు వజ్జ గోపి, పూడి సందీప్, బార్ల బాబూరావు, పిన్నింటి కాళేశ్వరరావు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ఒఎస్‌డి ఎస్.గిరిధదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 53 సీట్లను భర్తీ చేసేందుకు వీలుందని పేర్కొన్నారు. తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్నాటకలోని గడగ్‌లో నాలుగు సీట్లకు మూడేళ్ల పాటు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమో కోర్సులో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని స్పష్టం చేశారు. జూలై ఒకటో తేదీ నాటికి బిసి, జనరల్ కేటగిరీల అభ్యర్థులు 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారై ఉండాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 25 ఏళ్ల వయో పరిమితి ఉందని పేర్కొన్నారు. లేటరల్ ఎంట్రీ మూడేళ్ల డి.హెచ్.టి.టి కోర్సులో, ఇంటర్మీడియట్ ఎంపిసి, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటిఐ రెండేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేరుగా రెండో ఏట ప్రవేశం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.iihtvgr.com వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు. ఉచిత శిక్షణ అప్పరెల్, గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీ శిక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ ఒకటో తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08625-295003 కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆపద సమయాల్లో అప్రమత్తం

- శ్రీకాకుళం నగరంలో మాక్‌డ్రిల్
- పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి



మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అత్యవసర, ప్రమాద సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమను తాము రక్షించుకోవడంతో పాటు పక్క వారిని రక్షించేందుకు తోడ్పడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, తదితర శాఖలు సంయుక్తంగా మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించాయి. మాక్‌డ్రిల్‌ను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉగ్ర దాడులు, బాంబు పేలుడు, ఇతర దేశాల నుంచి దాడి వంటి ఘటనలు ఉత్పన్నమైతే వాటి నుంచి ప్రజలు రక్షణ పొందడానికి ఎలాంటి జాగ్రత్తలు పాటించాలన్న సూచన చేస్తూ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి సమయాల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇస్తే అక్కడి నుంచి ఆయా శాఖల అధికారులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడతారని చెప్పారు. మాక్‌డ్రిల్‌లో ప్రమాద స్థలిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఘటన సమయంలో 300 మంది ఉంటే వారిలో 35 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురు మృతి చెందినట్లు, 15 మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు ప్రదర్శించారు. ఆ సమయంలో ఎవరెవరు హాజరు కావాలి, ఎక్కడికి వారిని చేర్చాలి, ఎవరికి సమాచారం తెలియజేయాలన్న అంశాలపై సవివరంగా మాక్‌డ్రిల్‌లో వివరించారు. రోడ్డును క్లియర్ చేయడంతో పాటు సైరన్ మోగించడం, ప్రజలను అప్రమత్తం చేయడం వంటివి ప్రదర్శించారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఆమదాలవలస, పలాస రైల్వేస్టేషన్లలో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఎటువంటి ప్రమాదం ఎదురైనా సకాలంలో స్పందించడం, సమాచారాన్ని పోలీసులకు తెలియజేయడం ఎంతో ముఖ్యమన్నారు. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు స్వీయ రక్షణతో పాటు సమాచారాన్ని తెలియజేయడం ఎంతో కీలకమన్నారు. అనుమానాస్పద స్థితిలో ఎవరు కనిపించినా తప్పక పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఎఆర్ డిఎస్‌పి శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఆర్‌టిసి ఆర్‌ఎం విజయ్ కుమార్, ఎపి స్టేట్ ఆర్‌డిఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య, తదితర శాఖలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నాయి.





ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

చర్చలు సఫలం

- కుదిరిన జీడి కార్మికుల వేతన ఒప్పందం
- ప్రస్తుత వేతనంపై 10 శాతం పెంపునకు అంగీకారం

ప్రజాశక్తి - పలాస

జీడి వ్యాపారులు, జీడి కార్మిక సంఘ నాయకుల మధ్య వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. స్థానిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘ భవనంలో వేతన ఒప్పందంపై జీడి వ్యాపారుల సంఘం, జీడి కార్మికుల సంఘ నాయకుల మధ్య మంగళవారం చర్చలు జరిగాయి. రెండేళ్లకోసారి కుదుర్చుకునే వేతన ఒప్పందం ముగియడంతో, ఈ ఏడాదిలో రెండుసార్లు సమావేశమైనా ఒప్పందం ఖరారు కాలేదు. దీంతో ఈనెల 16వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని జీడి కార్మిక సంఘ నాయకులు అధికారులకు లేఖలు అందించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వేతన ఒప్పందం ఖరారైంది. 2023-2025 సంవత్సరంలో ఇచ్చిన వేతనం కంటే 10 శాతం అదనంగా ఇచ్చేందుకు జీడి వ్యాపారులు అంగీకరించారు. దీంతోపాటు బాయిలింగ్ వేసే కార్మికులకు బస్తాకు రూ.71, కటింగ్ చేసే కార్మికులకు కిలోకు రూ.34, పీలింగ్ కార్మికులకు కిలోకు రూ.12.50, ఎండబోత చేసే కార్మికులకు రూ.43 చొప్పున అదనంగా ఇచ్చేందుకు ఒప్పందమైంది. వేతన ఒప్పందానికి సహకరించిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షులు మల్లా శ్రీనివాస్, కోశాధికారి మల్లా సంతోష్, మల్లా భాస్కరరావు, జీడి కార్మిక సంఘ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సాన ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, వర్కింగ్ సెక్రటరీ సిందిరి సతీష్ కుమార్, పట్నాన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుసంఘాల ద్వారా జీడిపిక్కల సేకరణ

ప్రజాశక్తి - మందస



మాట్లాడుతున్న ఎపిడి కూర్మారావు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ దన్ వికాస కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా జీడి పిక్కల సేకరణ పారదర్శకంగా చేపట్టాలని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మహిళా సంఘాల సభ్యుల ఆదాయాభివృద్ధి మెరుగుపడాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వి.డి.వి.కె కేంద్రాలకు రైతులు ఉత్పత్తి చేసిన జీడిపిక్కలను గిట్టుబాటు ధర వచ్చేలా ఎఫ్‌పిఒల ద్వారా సేకరించాలన్నారు. సమావేశంలో ఎఫ్‌పిఒ అకౌంటెంట్ కృష్ణకుమారి, ఎం.ఎం.ఎస్ అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు తారక మోహన్, స్వామినాయుడు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మితాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్, జిల్లా ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు సూచించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన వేసవి తాపానికి డీహైడ్రేషన్ నుంచి రక్షణపై అవగాహన కల్పించారు. అధిక రక్తపోటు, సుగర్ వ్యాధిగ్రస్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో తగినంత నీరు తాగడం, చల్లని ప్రదేశాల్లో ఉండడం, బయటకు వెళ్లే ముందు తలపై టోపీ ధరించడం, ఎక్కువ సమయం ఎండలో ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్, మాంసాహారానికి వీలున్నంత వరకు దూరంగా ఉండాలన్నారు. తేలికపాటి దుస్తులు ధరించడంతో పాటు చల్లని నీటితో రెండు, మూడు సార్లు స్నానం చేయడం మంచిదన్నారు. ప్రతిఒక్కరూ రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, ఇందిరా ప్రసాద్, పి.జి గుప్తా, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి.నారాయణరావు, గుడ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిర్ల ప్రసాద్, రైతులు

భూ సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి- కొత్తూరు

గత ప్రభుత్వం ఆదేశాల మేరకు భూములు రీ సర్వేలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బాలకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల కృష్ణారావు, పెదకోట యతిరాజులు మాట్లాడుతూ సర్వం హక్కులు ఉన్న తమ భూమిలో వేరొకరికి పేర్లు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లెమ్మ రెవెన్యూ తమ భూమితో సంబంధం లేని వ్యక్తులకు రీ సర్వేలో ఎల్పిఎం నంబరులో జాయింట్ రైతుల పేర్లు నమోదు చేశారని అన్నారు. ఇలా తమ భూమిలో వేరొకరికి నమోదు చేయడంపై సమస్య పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో టెక్కలి డివిజన్ ఆర్డిఒ స్థానిక గ్రామసభకు వచ్చి నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. లేదంటే ఆందోళనలకు పడతామని స్పష్టం చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ... త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ధర్మారావు, చిన్నారావు, గోపాలు, రామారావు పాల్గొన్నారు.


పొందూరు : సర్వే చేస్తున్న అధికారులు

'ప్రత్యేక అవసరాలు' తీరుస్తాం

కవిటి : సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యాన 0 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే నిర్వహించి వారి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఇఒ ధనుంజయ మజ్జి తెలిపారు. మంగళవారం నుంచి జూన్ 9 వరకూ నిర్వహించనున్న ఈ సర్వేలో వినికిడి లోపం, దృష్టి లోపం, ఆటిజం, రక్త హీనత, మాట్లాడలేకపోవడం, మానసిక సమస్యలు వంటి ఇరవై ఒక్క రకాల వైకల్యాలు గుర్తించి వారిని సమీపంలో పాఠశాలలో చేర్పించడం ద్వారా వారి అవసరాలను సమకూర్చేందుకు ప్రభుత్వ కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీరికి కళ్లద్దాలు, చెవిటి మిషన్లు, మూడు చక్రాల సైకిళ్లు వంటి వాటిని ఉచితంగా అందించడమే కాకుండా లోపం కలిగిన మహిళలకు ఏడాదికి రూ.2వేలు స్టైఫండ్ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉండే ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు సహిత విద్య ఉపాధ్యాయులు ఎమ్మార్ కృష్ణారావు(8247393043), అరుణ్ కుమార్ (9391164018)లకు తెలియజేయాలని సూచించారు.

పొందూరు: పొందూరు మండలంలో వికలాంగుల సర్వేను మంగళవారం ప్రారంభించినట్లు ఎంఇఒ-2 పట్నాన రాజారావు తెలిపారు. పొందూరు పట్టణంలో వికలాంగులు కె.భరద్వాజ్‌ను గుర్తించమన్నారు. 0-18 ఏళ్ల వయసు గల బడి బయట గల వికలాంగులను గుర్తించి నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇఒపిఆర్‌డిలు దినేష్, రాధారాణి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐసిసిటియు నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లు వల్ల కార్మికవర్గం బానిసత్వంలోకి నెట్టేయబడతారని అన్నారు. ఈ సమ్మె ద్వారా లేబర్ కోడ్‌లు రద్దు కోసం పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, అసంఘటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తింపు వంటి సమస్యలపై ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎఐసిసిటియు నాయకులు కె.దుష్యంత్, కె.లోకనాథం, వి.మాధవరావు, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్కీమ్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 20న సార్వత్రిక సమ్మె విజయవంతంపై పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమామహేష్, బి.దుర్గారావు, సింహాద్రి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

మందస : మే 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి, విఆర్‌ఎ సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు ఎం.ధర్మారావులు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన సమ్మె విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.కృష్ణారావు, బి.వెంకటేష్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పోస్టర్లను అందజేస్తున్న సూరయ్య

బాల్య వివాహాలు నివారించాలి



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ నివారించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్ యాదవ్ అన్నారు. పురపాలక సంఘంలోని 10వ వార్డు హడ్కో కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో 'బాల్య వివాహాలు రహిత భారతదేశం' అనే కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కులు రక్షణ, బాల్యవివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు కోసం వివరించారు. బాలల కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. చిన్నతనంలో వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ. బాల్య వివాహాలు జరగకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. సచివాలయ మహిళా పోలీస్ ఉమ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగినట్లయితే తప్పనిసరిగా సచివాలయం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల రక్షణ కమిటీ సభ్యులు రీసు చిరంజీవి, టిడిపి నాయకులు రాచకొండ రాజు, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి పి.లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

నౌపడ : కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులపై, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులకు భయపడేది లేదని టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం వైసిపి సానుభూతిపరులు, సర్పంచ్ రాములమ్మ, ఎల్.రామారావు, కె.రామారావులను మంగళవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రోత్సాహంతో పోలీసులు వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. జగన్నాథపురంలో టిడిపి నాయకుల మధ్య జరిగిన గొడవల్లో వైసిపి మహిళా సర్పంచ్‌పైన, అలాగే గ్రామంలో లేని వైసిపి కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించడం హేయమైన చర్యని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బుడ్డా మోహన్‌రెడ్డి, సుగ్గు రామిరెడ్డి, ఎన్ని మన్మథరావు, లండ నిరంజన్, కుమార్, జోగి రాములమ్మ, అప్పన్న, కొమర రామారావు, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిలక్


బ్యాంకు ముందు పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు

ఖాతాదారుల పడిగాపులు

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకుకి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీంతో ఖాతాదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. సోమవారం సాయంత్రం గాలి వానకు యూనియన్ బ్యాంకుకు వచ్చే విద్యుత్ లైన్ తెగిపడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం వైర్లు సరిచేసి విద్యుత్ సరఫరా అందించేందుకు మధ్యాహ్నం అయింది. సోమవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇన్వెటర్లు ఛార్జింగ్ కూడా అయిపోయింది. విద్యుత్ సరఫరా వస్తుందని ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు ఎండలోని ఉక్కపోతలో మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. ఇంత పెద్ద బ్యాంకుకు జనరేటర్ లేకపోవడంతో ఖాతాదారులు బ్యాంకు సిబ్బందిపై మండిపడ్డారు.


సన్మానిస్తున్న గ్రామస్తులు

డిసిసిబి చైర్మన్‌కు సన్మానం

సరుబుజ్జిలి : డిసిసిబి చైర్మన్‌గా నియమితులైన శివ్వాల సూర్యనారాయణను స్వగ్రామం షలంత్రి తన నివాసంలో విశ్రాంత తహశీల్దార్, కాళింగ సంఘం నాయకులు, టిడిపి నాయకులు పేడాడ జనార్ధనరావు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంలో కూటమి ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరిస్తూ సమర్థులకు పదవులను ఇస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అనర్హులను అందలం ఎక్కించి సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. దాని ఫలితంగా ప్రజలు ఐదేళ్ల పాటు అష్టకష్టాలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విషయాలను ఆలోచించి సంస్థలను బలోపేతం చేస్తూ సమర్థులతో పదవులను భర్తీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు కిల్లి శేషు, ఎస్.వెంకటరావు, సిహెచ్.బి.ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

లావేరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం లావేరు శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ తయారు చేసి రెండు టీమ్‌లకు పోటీలు నిర్వహించారు. జగదీష్ టీమ్‌కు ప్రథమ, అవినాష్ టీమ్‌కు ద్వితీయ స్థానాలు వచ్చాయి. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతులు అందచేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు. టీమ్ నిర్వాహకులుగా పి.పద్మావతి వ్యవహరించారు. గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.


పోటీలను నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

పిడుగుపాటుకు గిరిజన యువతి మృతి

ప్రజాశక్తి- కొత్తూరు


చిన్నమ్మ మృతదేహం

మండలంలోని అడ్డంగి పంచాయతీ దిగుమల్లెలు గూడకు చెందిన సవర చిన్నమ్మ (30) అనే గిరిజన యువతి సోమవారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే... ఉదయం ఇంటి నుంచి మేకలు తోలుకొని మేత కోసం వెళ్లింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచాయి. రాత్రి మేకలు ఇంటికి వచ్చేశాయి. చిన్నమ్మ రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. రాత్రి 9 గంటల సమయంలో ఒక చోట శవమై పడి ఉంది. దీనిని గుర్తించి మృతురాలి అన్నయ్య రాజారావు కన్నీరుమున్నీరుగా విలపించారు. అక్కడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు : మండలంలోని పారాపురం వద్ద మంగళవారం ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ వాహన తనిఖీలు నిర్వహిస్తున్న బమ్మిడికి చెందిన చెందిన దిమిలి తిరుపతిరావు పది మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుబడ్డారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు.

వ్యాను బోల్తా

నందిగాం : మండలంలోని సుభద్రాపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం వ్యాన్ బోల్తా పడింది. పలాస నుంచి శ్రీకాకుళం వెళ్తున్న మినుములు, ఆవాలతో వ్యాన్ వెళ్తుంది. సుభద్రాపురం వద్ద టైరు పంచరై బోల్తా పడింది. అయితే ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సర్పంచ్ ప్రతినిధికి మాతృవియోగం

టెక్కలి : మండలంలోని అక్కవరం సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి ప్రతినిధి అప్పలనాయుడు తల్లి సావిత్రమ్మ (80) మంగళవారం తన నివాసం శ్యామసుందరాపురంలో మృతి చెందింది. గతకొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడేది. మృతురాలి భర్త రామ్మూర్తి నాయుడు ఎంపిటిసిగా, సర్పంచ్‌గా పనిచేశారు. సావిత్రమ్మ మృతికి కేంద్ర సహాయ మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, ముర్రి శంకరరావులు అప్పలనాయుడు పరామర్శించి ఓదార్చారు.


సావిత్రమ్మ (ఫైల్)

కొల్లివలసలో వ్యర్థాల తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ


నోటీసు అందజేస్తున్న అధికారులు

మండలంలోని కొల్లివలసలో మంగళవారం అధికారులు వ్యర్థాలను తొలగించారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో 'వ్యర్థాలతో అనర్థం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మండల అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి తోటవాడ పరిధిలోని కొల్లివలసలో కోళ్ల వ్యర్థాలు రోడ్లకు ఇరువైపులా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సిబ్బందితో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఉప్పినివలస, పాలవలస, లక్కుపురం గ్రామాల్లోనూ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. అనంతరం చికెన్ వ్యాపారుల యజమానులకు నోటీసులను అందజేశారు. మరలా ఎప్పుడైనా రోడ్లకు ఇరువైపులా వ్యర్థాలు వేసినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పాతపట్నం: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులందరూ సహకరించాలని మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, ఎంపిడిఒ పి.చంద్రకుమారి కోరారు. మండలంలోని కొరసవాడలో ప్రభుత్వ అదనపు సాయం పొందిన ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పునాదులు నుంచి లిన్టల్ లెవెల్ వరకు, లిన్టల్ లెవల్‌లో ఉన్నవారు రూఫ్ లెవెల్ వరకు, రూఫ్ లెవల్‌లో ఉన్నవాళ్లు ఇంటి నిర్మాణాన్ని శతశాతం పూర్తి చేయాలన్నారు. జూన్ 12 లోగా ఈ నిర్మాణాలన్నీ పూర్తి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ సీతారామరాజు, సర్పంచ్ ఉమాదేవి, సెక్రెటరీ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం గణేశ్వరరావు

రాష్ట్రస్థాయిలో కీర్తన సత్తా

ప్రజాశక్తి- మందస

ఇటీవల విడుదలైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఇంటర్ విభాగం)లో కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన పైల కీర్తన రాష్ట్రస్థాయిలో 31వ ర్యాంకు సాధించింది. ఈ పరీక్షలు 1/3 వంతు నెగిటివ్ మార్కులు ఉన్నా.. వంద మార్కులకు 82 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.గణేశ్వరరావు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఇటీవల ఇంటర్ ఫలితాల్లో 590 మార్కులతో సత్తా చాటింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కౌలుకు ఆలయ భూములు

బూర్జ : బూర్జలో రాధాకాంత స్వామి ఆలయానికి సంబంధించిన భూములను కౌలుకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మదనాపురం గ్రామ పరిధిలో వివిధ సర్వే నంబర్లలోని మూడు ఎకరాలు పల్లం భూమిని మూడేళ్ల కాలానికి కౌలు హక్కుకు టెండర్లకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఈ నెల 21న మదనాపురంలో శివకేశవస్వామి క్షేత్రం వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల పాటదారులు రూ. 2 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొవాలని అన్నారు.

జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల నియామకం

కోటబొమ్మాళి: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆరంగి అప్పన్నను నియమిస్తూ విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంతబొమ్మాళి మండలం బోరుభద్రకు చెందిన అప్పన్న గతంలో ఇదే కాలేజీలో తొమ్మిదేళ్ల పాటు అధ్యాపకునిగా పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


కోటబొమ్మాళి: అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

ధనుంజయరావు బాధ్యతల స్వీకరణ


కొత్తూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గణపతి ధనుంజయరావు బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఆమదాలవలసలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు కె.గోవిందరావు, బోగి లక్ష్మినారాయణ, బి.బుజ్జిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఖరీఫ్ సాగుపై అవగాహనా ర్యాలీ

ఆమదాలవలస : ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యాన మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో ఖరీఫ్‌పై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిఎఫ్ చేపేన సురేష్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంలో చేయవలసిన పద్ధతుల గురించి తెలియజేశారు. 'ప్రకృతి వ్యవసాయం - పుడమి తల్లిని కాపాడుదాం, పలు పంటలు వేద్దాం-అధిక ఆదాయం పొందుదాం' అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపేన సత్తిరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, రైతులు కోటేశ్వరరావు, అప్పలనాయుడు, రమణమూర్తి పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పించడమే లక్ష్యం

కవిటి: అవసరమైన, అర్హులైన బడుగు బలహీన తరగతులకు చెందిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఎపిడి సిహెచ్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెం, కళింగపట్నం, పి.కెపాలెం, సముద్ర తీర ప్రాంతంలోని గ్రామాలను మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అంతేకాకుండా ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ కూలీలకు ఉపాధి పనులకు అవసరమైన పరిస్థితులు కల్పించి వారికి పూర్తిస్థాయి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో పనులు గుర్తించి సిబ్బందికి సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.శ్రీనివాసరెడ్డి, ఎపిఒ మోహనరావు, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎపిడి శ్రీనివాసరెడ్డి

బుద్ధుని బోధనలు ఆదర్శం

శ్రీకాకుళం : శాంతిమార్గాన మానవుని జీవితం పరిఢవిల్లేందుకు బుద్ధుని బోధనలు ఆచరించడమే సరైన మార్గమని వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ పేర్కొన్నారు. బుద్ధుని జయంతి సందర్భంగా కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నగరంలోని విశాఖ-బి కాలనీలోని గౌతమ్ నగర్‌లో బుద్ధుని విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచ శాంతికే కాకుండా మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక అశాంతిని కూడా దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, విజయ, సరోజ, గౌతమ్, కిరణ్, శ్రీనివాస్, ఎన్.సత్యనారాయణ, కె.లక్ష్మణరావు, పద్మ, రజని పాల్గొన్నారు.


బుద్ధుని విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నిర్వాహకులు

నగరంలోని శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో బుద్ధుని విగ్రహానికి దాతలు కె.వి.వి.ఎస్.వర్మ, నిర్వాహకులు ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, బొడ్డేపల్లి దామోదరరావు, పందిరి అప్పారావు, జెసీస్ ప్రతినిధులు అనీల్, బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


కవిటి : అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ నాగరాణి

బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది

ప్రజాశక్తి- కవిటి

కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగులు వేసేందుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని సిడిపిఒ నాగరాణి అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెం, బి.జి.పుట్టుగ అంగన్వాడీ కేంద్రాల్లో కిషోర వికాసంలో భాగంగా 15 నుంచి 18 ఏళ్ల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసులో బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు తెలిపారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో సూపర్‌వైజర్లు కృష్ణవేణి, పల్లవి, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, విఒఎలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్చాపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోర వికాసం నిర్వహించారు. 15 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు రక్షణ, ఫోక్సో చట్టంపై వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం : ఫోక్సో చట్టం బాలికలకు రక్షణ కవచంగా నిలుస్తుందని సానా వీధి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి వావిలపల్లి సుమన అన్నారు. అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం చేపట్టిన వేసవి శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని పోక్సో చట్టం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ రేణుక, సూపర్‌వైజర్ యశోద పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

మెళియాపుట్టి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని తహశీల్దార్ బి.పాపారావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలుదారు గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ పరిశీలనపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. కౌలుదారు కార్డు భూమి సాగు హక్కు పత్రం పొందిన రైతులకు విధిగా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు అర్హులవుతారని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి రైతుల భూమి వివరాలు త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. రైతులందరూ కూడా తమ రైతు సేవా కేంద్రాలను సందర్శించి భూముల వివరాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.దానకర్ణుడు, డిటి రాము, వ్యవసాయ విస్తారనాధికారి ప్రభావతి, సీనియర్ సహాయకులు జగన్మోహన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కవిటి

సెల్ ఫోన్లతో మమేకమైపోతున్న నేటి చిన్నారులు, యువతకు క్రీడలపై ఆసక్తి, అవగాహన కల్పించాల్సిన అవసరం అత్యావశ్యకమని జిల్లా క్రీడాభివృద్ధి జూనియర్ అసిస్టెంట్ మాదిన రాంబాబు అన్నారు. మండలంలోని బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వమే కాకుండా మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. స్థానిక విద్యార్థులు, యువకులు నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబూరావు, ఉపాధ్యాయుడు పొందల ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లెడ రమేష్ పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న రాంబాబు

ఎచ్చెర్ల : షాప్ ఆధ్వర్యాన మండలంలోని కేశవరావుపేటలో సాఫ్ట్‌బాల్, వాలీబాల్‌పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ నరహసింహారెడ్డి, సర్పంచ్ పైడి భాస్కరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మెట్ట తిరుపతిరావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.రమణ, మల్లేష్, పి.వెంకటరమణ, పి.హరికృష్ణ పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న సభ్యులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- పలాస


మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. పలాస ముత్యాలమ్మ కోనేరు నెహ్రూ పార్కులో బెల్లాల ప్రమోద్ కుమారుడు, ధన్విన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మొక్కలు నాటారు. దాని సంరక్షణకు కొంత మొత్తాన్ని ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టినరోజు, పర్వదినాలు, వర్ధంతులకు మొక్కలు నాటడం ద్వారా మానవాళికి ప్రాణ వాయువు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పండిత రాజేంద్ర, దడియాల నరసింహులు, లండ నాగరాజు, పండర బుజ్జి, రాము పాత్రో, సంతోష్ పాత్రో, పరమేశ్వరి, మోహనరావు, రామారావు, మోహనరావు మాస్టర్, నీలిమ, తేజ, మధు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ముద్దు

ప్రజాశక్తి- నౌపడ

ఆరోగ్యవంతమైన అహారోత్పత్తికి రాబోవు కాలంలో ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యమని సంతబొమ్మళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు అన్నారు. మండలంలోని గోవిందపురం రైతు సేవా కేంద్రం పరిధి సవరపేటలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగమైన నవధాన్యాల సాగుపై చర్చావేదిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల్లో రసాయన రహిత సేద్యపు ఉత్పత్తులపై మక్కువ పెరుగుతున్న దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ రాబోతుందన్నారు. తద్వారా ప్రకృతి వ్యవసాయం లాభసాటి కాబోతోందని తెలిపారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న మాట్లాడుతూ గ్రామం నుంచి ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు కింజరాపు ఉష, తంగి విజయ, తంగి వేణమ్మ, వ్యవసాయ సహాయకుడు వాదాల బాలకృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని మాకవరం యూనిట్‌లో అల్తి గిరిజన గ్రామంలో గిరిజన రైతులతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాలు సాగు వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. వరి పంట ఎదలో ఎలా వేసుకోవాలి, వరి దమ్ములో ఎలా వేసుకోవాలని వివరించారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలిసోని, ఐసిఆర్‌పిలు సిహెచ్.రమణమ్మ, ఎ.మాధవి, ఇమ్యూనిటీ ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ధనలక్ష్మి, వెంకటరావు, భీమాడు, భీమరాజు పాల్గొన్నారు.


నౌపడ : మాట్లాడుతున్న ఎఒ అప్పారావు